RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 260

మంగళవారం
సెప్టెంబర్ 16, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలి

3లో..

# గుడ్లప్పగించేస్తున్నారు!

- పిల్లలు, పెద్దలు అనే తేడా లేదు
- కండ్లపై విపరీతమైన భారం
- పెరుగుతున్న మొబైల్ స్క్రీన్ టైం
- ఎక్కువ సమయం ఫోన్ చూస్తే ఇబ్బందులు: నిపుణులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

"సమయం ఉదయం 7 గంటలు..ఆ రోజు ఆదివారం..సెలవు దినం కావడంతో కొంచెం ఆలస్యంగానే రాజు నిద్ర లేచాడు. పొద్దున్నే తన కూతురుతో కాస్త సమయం గడిపేందుకు కూర్చొగానే ఏడ్వడం మొదలయింది. సెల్ ఫోన్ కావాలని చిన్నారి మారాం చేయడం షురూ కాగానే, ఇచ్చేశాడు. పది నిమిషాల తర్వాత తీసుకుంటానని అనుకున్నాడు. చిన్నారితో పాటు అతను సైతం స్మార్ట్ ఫోన్‌లో రీల్స్ చూడటం స్టార్ట్ చేశారు. ఇంట్లో నుంచి 'ఇంకెంత సేపు ఫోన్ చూస్తారు..' అని అరుపులు వినబడ్డాయి. అప్పుడు తేరుకుని సమయం చూస్తే.. 8.40 గంటలు.. అంటే సుమారు గంటన్నరకుపైగానే సమయం ఊరికేనే అలా గడిచిపోయింది."



"అది సమయం 5 గంటల ప్రాంతం.. వృత్తి బాధ్యతల్లో భాగంగా జర్నలిస్టు కమలాకర్ వార్తల సమాచారం కోసం స్మార్ట్ ఫోన్‌లో ఓ వ్యక్తి పంపిన ఇన్ఫో చెక్ చేస్తుండగా, ఆయనకు సోషల్ మీడియా యాప్స్ నుంచి ఓ లింక్ వచ్చింది. ఆసక్తికరంగా ఉందని అది ఓపెన్ చేసి చూశాడు. అంతటితో ఆగకుండా ఆ తర్వాత లింక్ బ్రౌజ్ చేశాడు. అలా చూస్తుండగానే సమయం 6.30 గంటలు దాటింది. పైస్థాయి వ్యక్తుల నుంచి కాల్ రావడం.. ఇంకా వార్త ఇవ్వలేదనే చివాట్లు పడ్డాయి. వెంటనే వార్త ఇవ్వాలనే ఆదేశాలతో తేరుకుని సదరు సమాచారం గురించి తెలిసినంత మేరకు ఆదరాబాదరగా ఆఫీసుకు వార్తా కథనాన్ని అందించాడు."

పైన పేర్కొన్న రెండు సంఘటనల్లో ఏం జరిగిందో నిశితంగా పరిశీలిస్తే.. అది వాళ్లకు మాత్రమే జరిగింది కాదనిపిస్తుంది. దాదాపుగా అందరి జీవితాల్లో అదే మాదిరిగా పలు సంఘటనలు జరుగుతుంటాయని స్పష్టమౌతుందని చెప్పొచ్చు. చాలా మంది తాము చేయాల్సిన పనిని పక్కనపెట్టి సోషల్ మీడియా యాప్స్, ఇతర గ్రూపుల్లో బ్రౌజింగ్ కోసం.. టైంను పరిధి దాటి కేటాయిస్తున్నారు. గుడ్లప్పగించి మరీ.. మొబైల్ స్క్రీన్‌ను చూసేస్తున్నారు. అసలు దేని గురించి తాము స్మార్ట్ ఫోన్ తీసుకున్నాం అనేది పక్కకు జరిగి..ఇతర విషయాలతోనే సమయం వృథాగా ముందుకు సాగుతుండటం గమనించొచ్చు. కాగా, అలా విపరీతంగా స్మార్ట్ ఫోన్ స్క్రీన్‌ను చూడటం వల్ల కంటి నొప్పే కాదు ఇతర అనారోగ్యాల బారిన పడే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అతి ఎప్పుడైనా చేటేనని వివరిస్తున్నారు. ప్రస్తుతం పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ ఫోన్‌ను దాదాపుగా తెగ చూసేస్తున్నారని, బ్రౌజింగ్ చేస్తూ.. వీడియోలను గుడ్లప్పగించి చూసేస్తున్నారని, ఫలితంగా ఇబ్బందులు సమీప భవిష్యత్తులో వస్తాయని వెల్లడిస్తున్నారు.




**- మారాం చేస్తే.. పిల్లలకు ఫోన్ ఇవ్వొద్దు**

మిగతా 3వ పేజీలో..

## ఫోన్‌ను అతిగా చూస్తే దూరదృష్టి కోల్పోయే ప్రమాదం

**- ప్రముఖ నేత్ర వైద్యులు, డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి**



స్మార్ట్ ఫోన్‌ను అతిగా చూడటం వల్ల దగ్గరి దృష్టి మాత్రమే ఉండి.. దూరదృష్టిని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. పిల్లలు లేదా పెద్దలు ఎవరైనా సరే.. స్మార్ట్ ఫోన్‌ను అదే పనిగా చూస్తుండటం వల్ల వారి భంగిమల్లో తేడా ఏర్పడి మెడలు వంగిపోయి.. మెడనరాల్లో నొప్పి వస్తుంది. అంతేగాకుండా వెన్నె ముక నొప్పి కూడా రావచ్చు. ఎందుకంటే 90 డిగ్రీస్‌లో నిటారుగా కాకుండా వెన్నెముక వంగినట్టుగా ఉండటం వల్ల వెన్నెముకకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు తలెత్తొచ్చు. పిల్లల్లో అయితే సృజనాత్మకత లోపించి.. మానసికపరమైన ఇబ్బందులు వస్తాయి. అదే పనిగా స్మార్ట్ ఫోన్ పట్టుకుని ఉండటం వల్ల రేడియేషన్ వల్ల కంటిపై తీవ్రభారం పడుతుంది. కండ్లు పొడిగా మారి.. కంటి సంబంధిత దృష్టి లోప సమస్యలు వస్తాయి. కాబట్టి పిల్లలు, పెద్దలు ఎవరైనా సరే స్మార్ట్ ఫోన్‌ను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించడం మంచిది.

## పిల్లలతో తల్లిదండ్రులు సమయం గడపాలి

**- శిశు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బి.రమేశ్**



పిల్లలు మారాం చేస్తున్నారని, తల్లిదండ్రులు తమ బిజీ షెడ్యూల్ వల్ల ఫోన్లు కొని ఇచ్చేస్తున్నారు. దాంతో పిల్లలు స్క్రీన్‌ను తెగ చూసేస్తున్నారు. అది పిల్లల మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. ఎక్కువ సేపు స్మార్ట్ ఫోన్‌ను చూడటం వల్ల అది పిల్లల మానసిక ఎదుగుదల, ఆలోచనలపైన ప్రభావం చూపే అవకాశాలు ఉంటాయి. కాబట్టి అలా చేయకూడదు. తల్లిదండ్రులు పిల్లలతో చక్కగా సమయం గడపాలి. వారిని పార్కులకు తీసుకెళ్లి.. వారితో ముచ్చటించాలి. తద్వారా పిల్లలకు స్మార్ట్ ఫోన్ టైం తగ్గి..కుటుంబంతో ప్రేమ, అనుబంధం, అప్యాయత, అనురాగాలు బలపడుతాయి. సంభాషణ సామర్థ్యాలు పెరుగుతాయి. పిల్లలతో పాటు పెద్దలు సైతం స్మార్ట్ ఫోన్‌ను అవసరం మేరకు మాత్రమే వాడితే మంచిది.

## స్మార్ట్ ఫోన్ అతి వాడకం ఆరోగ్యానికి హానికరం

**- డాక్టర్ ఊడుగుల సురేశ్, ఎండీ, జనరల్ ఫిజీషియన్**



స్మార్ట్‌ఫోన్ ఎక్కువసేపు వాడటం వల్ల పిల్లలు, పెద్దలపై శారీరక, మానసిక ప్రభావాలు ఉంటాయి. పిల్లల్లో కంటి సమస్యలు (చూపు తగ్గడం, కంటి ఎర్రబడటం, డబుల్ విజన్, మైయోపియా పెరగడం) నిద్రలేమి (రాత్రి స్క్రీన్ వాడితే మెలాటోనిన్ తగ్గిపోతుంది) వస్తుంది. శారీరక చురుకుదనం తగ్గిపోవడం, ఒబెసిటీకి అవకాశం ఏర్పడుతుంది. కోపం, డిప్రెషన్, సోషల్ ఐసోలేషన్ ఏర్పడుతుంది. ఇక పెద్దల్లో పెద్దల్లో కంటి అలసట, మెడ, వీపు నొప్పులు ("టెక్స్ట్ నెక్"), నిద్ర సమస్యలు వస్తాయి. మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ , ఫ్యామిలీ, సోషల్ ఇంటరాక్షన్ తగ్గిపోవడం జరుగుతుంది. కాబట్టి జాగ్రత్త వహించాలి. ప్రతి 20 నిమిషాలకోసారి 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్లు చూడాలి. భోజనం, నిద్ర ముందు, ఫ్యామిలీ టైంలో ఫోన్ వాడకూడదు. వినోదం కోసం ఎక్కువసేపు ఫోన్ వాడటం మనిషి మానసిక, శారీరక ఆరోగ్యానికి హానికరం.

## ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వృద్ధుడు..!



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

కొడుకు, కోడలు పోషించడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు ఆత్మహత్యా యత్నం చేశాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండలానికి చెందిన అజ్మీరా విఠల్ అనే వ్యక్తి సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో విఠల్ తన భార్య విరవ్వతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చాడు. తన కుమారుడు నరేష్ నాయక్, కోడలు తమను సరిగా పోషించడం లేదని, ఉన్న భూమిని కూడా వారే సాగు చేసుకుంటూ తమకు అన్నం పెట్టడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలోనే, మనస్తాపానికి గురైన విఠల్ అక్కడే పురుగుల మందు తాగాడు. వెంటనే అప్రమత్తమైన అధికారులు అతడిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విఠల్ అక్కడ చికిత్స పొందుతున్నాడు.

## బైపాస్ రోడ్లపై సెంట్రల్ లైటింగ్ వెలుగులు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సుందరీకరణలో భాగంగా బైపాస్ రోడ్లపై సెంట్రల్ లైటింగ్ వెలుగులు వెలిగాయి. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పట్టణ పరిధిలోని రెండు ప్రధాన బైపాస్ రోడ్లు ఆధునిక లైటింగ్ సౌకర్యం కలిగింది..రగుడు జంక్షన్ నుండి విద్యానగర్ జంక్షన్ వరకు 4 కిలోమీటర్లు, అలాగే రగుడు జంక్షన్ నుండి చంద్రంపేట, చిన్న బోనాల, పెద్ద బోనాల, పెద్దూర్ మార్గంగా వెంకటపూర్ వరకు 11 కిలోమీటర్ల దూరంలో మొత్తం 7.10 కోట్ల రూపాయల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ అమలు చేశారు. ప్రజలకు రాత్రి వేళల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వాహనదారులకు సురక్షిత ప్రయాణం ఉండేలా ఈ లైటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్లకు కొత్త అందం వచ్చి, ప్రమాదాలు నివారించడంలో కూడా ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ సౌకర్యం ప్రారంభం కావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**వేద న్యూస్, వరంగల్:**



సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమర్పించిన వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. నేటి ప్రజావాణి కార్యక్రమానికి 166 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ సమస్యలు 72, జిడబ్ల్యూఎంసీ 20, గృహ నిర్మాణ శాఖ 11, విద్యా శాఖ 9, డిఆర్డీఓ 7, ఇతర శాఖలకు సంబంధించిన 47 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు మానవీయ కోణంలో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం సెప్టెంబర్ 16, 2025

## రాజన్న ఆలయ మూసివేత పై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి

### – ప్రతాపరామకృష్ణ డిమాండ్



**వేద న్యూస్, వేములవాడ:**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధిలో భాగంగా భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పిస్తుండటంతో రాజన్న ఆలయం మూసివేతపై ప్రభుత్వం వెంటనే క్లారిటీ ఇవ్వాలని ప్రతాపరామకృష్ణ డిమాండ్ చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంలో దసరా తర్వాత మూసివేస్తామని అన్నారని, దసరా తర్వాతనా ముందా అనేది శ్వేత పత్రం విడుదల చేయాలని,ఎన్ని నెలల్లో పూర్తి చేస్తారో వివరణ ఇవ్వాలని, అభివృద్ధిలో భాగంగా గుడి లోపల దర్గాను కూడా మార్చాలని, దర్గాను ముట్టుకోకుండా హిందూ దేవాలయాల విగ్రహాలను ముట్టుకుంటే ఊరుకునేది లేదని, దేవాలయం మూసివేతతో ప్రత్యక్షంగా 500 కుటుంబాలు పరోక్షంగా 3000 కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పిస్తుందని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే దేవాలయ అభివృద్ధిని ఎన్ని నెలల్లో పూర్తి చేస్తారో స్పష్టంగా తెలపాలని అన్నారు.

## యూరియా అమ్మకాలపై డీలర్లకు తగు సూచనలు

**వేద న్యూస్, శాయంపేట:**




శాయంపేట గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ రైతు వేదికలో డీలర్లకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశంలో యూరియా అమ్మకాలపై డీలర్లకు తగు సూచనలు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖలో చేపట్టబడుతున్న వివిధ పథకాలపై వ్యవసాయ శాఖ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. ఇట్టి సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ శ్రీనివాస్ , మండల వ్యవసాయ అధికారి గంగా జమున ,టెక్నికల్ ఏవో కే కమలాకర్ , వ్యవసాయ శాఖ సిబ్బంది , డీలర్లు పాల్గొన్నారు.

# కేయూ లో ఘనంగా ఇంజనీర్స్ డే

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇంజ నీర్స్ డే జరుపుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరిం చుకొని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్య అతిథిగా విచ్చేసి భారతరత్న ఎం. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిని నేటి ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణలను చేపట్టే విధంగా, ప్రతి కూల పరిస్థితిలు, సరైన వసతులు లేనప్పటికీ వారు ఎన్నో అద్భుత నిర్మాణాలను చేపట్టారని గుర్తు చేశారు. నేటికీ చిరస్థాయిగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమానికి టీజీఎన్ పిడిసిఎల్ మాజీ డైరెక్టర్ శ్రీమతి పి. సంధ్యారాణి గౌరవ అతిదిగా విచేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సిఎస్ఈ విభాగం పూర్వ విద్యార్థులు శ్రీ కే.అఖిల్ రెడ్డి అనలిటిక్స్ లీడ్, అవిరా డిజిటల్, శ్రీ అరవింద్ వల్లెంగుల, టిసిఎస్ టీమ్ లీడ్, విద్యార్థులతో సంభాషించారు. ఈసిఈ విభాగంపూర్వ విద్యార్థులు ఎస్ కార్తీక్ మిత్ర, కృతానంద మూర్తి కె.ఐశ్వర్య, ఎమ్ డి. మునవర్, పి .సుశ్రుత్ కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థులు శ్రీ రామకృష్ణ, ఎన్ ఎల్ పి ఇంజనీర్, శ్రీ ఆసిఫ్ బాబా, ఎగ్జిక్యూషన్ ఇంజనీర్, మేఘ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆన్‌లైన్ సెషన్‌లను నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థు లు శ్రీ టి. సాయిరామ్ ఏఈఈ, శ్రీ ఎండీ. ఆసిఫ్ అలీ ఏఈఈ కెరీర్ మార్గదర్శకత్వాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. రమణ ముగింపు సందేశంలో ఇంజనీరింగ్ విలువలను నిలబెట్టడానికి పరిశోధన, ఆవిష్కరణ, ఆచరణాత్మక అభ్యాసంపై దృష్టి పెట్టాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

## ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు





**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

సోమవారం మహిళా ఇంజనీరింగ్ కాలేజ్ కేయూ సెమినార్ హాల్లో ఇంజనీర్స్ డే వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. బిక్షాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బి. కిషోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని జాతీయ ఇంజనీర్స్ డే జరుపుకుంటామని, ఇందులో భాగంగా కళాశాల విద్యార్థినిలు ప్రతీ ఇంజనీరింగ్ విభాగం ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయని, ఏ బ్రాంచ్ చదివినా అనేక అవకాశాలను అందిపుచ్చుకొని సమాజంలో ముందు వరుసలో ఉండాలని, ముఖ్యంగా అమ్మాయిలు ఆర్థిక స్వాతంత్రం ఉండాలంటే కచ్చితంగా ఉన్నత స్థానంలో ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కే. బిక్షాలు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు ఈ దేశానికి, మన రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని తెలియజేశారు. వారి అడుగుజాడల్లో మనం అందరం నడవాలని, వారి ఆశయాలను ముందుకు నడిపించడంలో అమ్మాయిలు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించి గొప్ప గొప్ప పదవులను, ఉద్యోగాలను అధిరోహించాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం కళాశాల నుండి ఈఈఈ విభాగంలో 2021 బ్యాచ్ విద్యార్థిని అనూషను సన్మానించారు. అనూష 2025లో ఉద్యోగం సంపాదించి అసిస్టెంట్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ విభాగంలో యాదాద్రి పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్నారు. ఈకార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, ఈ ప్రోగ్రాం కన్వీనర్ తూర్పాటి వెంకటేష్, అధ్యాపకులు సాయి తరుణ్, శ్రీనివాస్, కిరణ్ కుమార్ ,వాణిశ్రీ, యశస్విని ,వైష్ణవి, దీప్తి, రచన జోష్ణ అనూష, కళాశాల సూపరిండిడెంట్ బానోతు వీరు నాయక్, కళాశాల విద్యార్థులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

# హద్దులు ఏర్పాటు చేయాలి

**వేద న్యూస్,శాయంపేట:**



శాయంపేట మండలంలోని మైలారం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని ఆ గ్రామ మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గడిపె విజయ విజయ్ కుమార్‌లు ఆరోపించారు. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని దళితుల వ్యవసాయ భూమి, శ్మశాన వాటికలోని కొంత భూమిని కాంగ్రెస్ నాయకుడు ఆక్రమించుకున్నాడని తెలిపారు. అంతేగాక హుస్సేన్ పల్లి నుంచి మైలారం వరకు జరుగుతున్న కట్ట మరమ్మతు పనులను నిలిపివేశారని, కట్టను జేసీబీతో తవ్వించి కొంత భూమిని తన వ్యవసాయ భూమిలో కలుపుకున్నాడని చెప్పారు. దళితులకు చెందిన భూమిని కొనుగోలు చేశాడని, కానీ కొనుగోలు చేసిన భూమి కాకుండా మిగిలిన భూమిని అక్రమంగా కబ్జా చేశాడని వెల్లడించారు. సాగు భూమి పక్కనే ఉన్న పిల్లకాలువను సైతం ఆక్రమించాడని తెలిపారు. అధికార పార్టీ, ఎమ్మెల్యే అండదండలతోనే ఈ చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమించుకున్న భూములపై సర్వే చేయాలని కోరారు. శ్మశాన వాటికకు, చెరువు కట్టకు హద్దులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకుడు పై చట్టపరమైన చర్యలు తీసుకుని గ్రామస్తులకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దూదిపాల తిరుపతిరెడ్డి, దూదిపాల రాజిరెడ్డి, అరిజెల సాంబరెడ్డి, నూనె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## గురువులపై గురుతర బాధ్యత

**వేద న్యూస్, చొప్పదండి :**



విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దేది తరగతి గదిలోనే అంటారు. పెద్దలు అలాంటి గదిలో చదువుతో పాటు మంచి క్రమ శిక్షణ అలవర్చి వారి జీవితాలకు బంగారు బాటలు వేశేది ఒక్క గురువేనని ఎమ్మెల్యే మేడి పల్లి సత్యం పేర్కొన్నారు. ఉత్తమ గురువులుగా ఎంపికైన 26 మంది ఉపాధ్యాయులను సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరికో విద్య దానం చేసి దేశానికి ఉన్నతులను అందించిన గురువుల విలువ వెల కట్టలెందన్నారు. ఇది ఇలా ఉండగా ఎంపికలో కనీస ప్రమాణాలు పాటించక వారి వారి అనూయులకే కొందరికి పెద్ద పీట వేశారనే అపవాదు మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ను యూనియన్ నాయకులు ప్రజావాణిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నందున కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో బతుకమ్మ, దసరా పండుగలు రానుండగా వేతనాలు రాక కార్మికులు భార్యా పిల్లలకు కొత్త బట్టలు కొనివ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా ప్రతి నెలా 1వ తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు అందుతాయని చెప్పినా, ఆ హామీ అమలు కాలేదని ఆయన గుర్తుచేశారు. అరకొర వేతనాలు ఉన్నప్పటికీ, అవి కూడా సమయానికి రాక కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని గణేష్ తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రతి నెలా 1వ తేదీకి వేతనాలు చెల్లించేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జి.ఓ. నెంబర్ 51 సవరించాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ సదుపాయం, ప్రత్యేక వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు.

జిల్లా కలెక్టర్ కార్మికుల సమస్యలను విని జిల్లా పంచాయతీ అధికారిని రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఆదేశించగా, యూనియన్ నాయకులు కలెక్టర్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు వర్కోలు మల్లయ్య, బుర్ర శ్రీనివాస్, లొకిని శ్రీనివాస్, నరపురం నర్సయ్య, రేసు రాజయ్య, పెంట రాజు, బిగుల్లా అశోక్, అక్కల అంజయ్య, సందేలా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మక్కపేట నర్సరీని సందర్శించిన ఎంపిడిఓ

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**




ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపిడీఓ సలీం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెరుగుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. మొక్కల పెంపకంపై పలు జాగ్రత్తలు తీసుకోవాలని, మొక్క మొక్కకు మధ్య పిచ్చి మొక్కలు ఉంటే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని ఎంపీడీవో సలీం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్, పంచాయతీ కార్యదర్శి సరిత, తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లప్పగించేస్తున్నారు!

ఇక పిల్లలు నెలల వ్యవధి నుంచి ఏండ్ల వరకు మారాం చేసిన ప్రతీసారి కొందరు తల్లిదండ్రులు సెల్ ఫోన్ అప్పజెప్పి.. తప్పించుకుంటుండటం గమనించొచ్చు. దాంతో పిల్లలు గంటల తరబడి స్మార్ట్ ఫోన్ స్క్రీన్‌ను చూస్తూ.. తినడం, ఆడుకోవడం అలానే..ఒకే చోట కూర్చుండటం చేస్తుంటారు. కాగా, అలా పిల్లలకు ఎక్కువ సమయం ఫోన్లు ఇవ్వకూడదని నిపుణులు చెబుతున్నారు. వారికి చక్కగా కథలు చెబుతూ.. అన్నం తినిపించాలని, భౌతికంగా క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చేలా మైదానంలోకి తీసుకెళ్లాలని పేర్కొంటున్నారు. నెలల వ్యవధి ఉన్న చిన్నారులకు స్మార్ట్ ఫోన్‌ను ఎక్కువ సేపు చూయించొద్దని అంటున్నారు. పెద్దలకూ ఈ నిబంధన వర్తిస్తుందని వివరిస్తున్నారు. అయితే, మానవుడి దైనందిన జీవితంలో స్మార్ట్ ఫోన్ భాగమై, ప్రతీ పనికి అది కంపల్సరీ అయిన నేపథ్యంలో.. దానిని జాగ్రత్తగా వాడాలని .. నిబంధనలు, పరిమితులను నిర్దేశించుకుంటే మంచిదని అభిప్రాయపడుతున్నారు. స్మార్ట్ ఫోన్ ప్రతీ వ్యక్తి చేతిలో ఉన్న అణ్వాయుధం వంటిదని, దానిని జాగ్రత్తగా వాడుకోవాలని పులువురు సూచిస్తున్నారు.



**– కళ్ల రెప్పలు వేయడం ఎక్కువైనా ప్రమాదమే!**

ప్రతీ మనిషి రెప్పవేయడం సాధారణం. అప్పుడే పుట్టిన నవజాత శిశువులు నిమిషానికి రెండు సార్లు మాత్రమే కనురెప్పలు వేస్తారు. పిల్లలు సాధారణంగా 14 నుంచి 17 సార్లు రెప్పకొడుతుంటారు. అయితే, అధికంగా రెప్పవేయడం చాలా సందర్భాల్లో సాధారణం కాదని గుర్తించాలి. కంటిలోపల ఇరిటేషన్, భారవం వల్ల కను రెప్పలను అధికంగా పిల్లలు వేస్తుంటారు. కాబట్టి ఈ సంగతిని తల్లిదండ్రులు గుర్తించాల్సి ఉంటుంది.

**– స్మార్ట్ ఫోన్ విజన్ సింద్రోమ్ లక్షణాలివే**

చీకట్లో స్మార్ట్ ఫోన్‌ను ఎక్కువ సేపు వాడే వారికి స్మార్ట్ ఫోన్ విజన్ సింద్రోమ్(ఎస్‌వీఎస్) ఎక్కువగా వస్తుంటుంది. చీకటి ప్రదేశాల్లోనే అత్యధిక సమయం స్మార్ట్ ఫోన్‌తో గడపడం వల్ల దృష్టి లోపాలు కూడా వస్తాయి. దృష్టి అస్పష్టంగా ఉండటం, వస్తువులు తేలియాడుతున్నట్టుగా అనిపించడం, చూసే ప్రతీది మెరుపులా వెలుగుతున్నట్టుగా ఉండటం, చూసే ప్రతి దానిపై రేఖలు ఉండటం, ఒక వస్తువు లేదా మనిషి.. ప్రతిది డబుల్‌గా కనిపించడం వంటి లక్షణాలు ఈ సింద్రోమ్ ఉన్న వారిలో కనిపిస్తాయి. ఎక్కువ సేపు ఫోన్ చూడటం వల్ల చాలా మందిలో నిద్రలేమి ఉండటం ప్రస్తుతం సహజంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ ప్రతి 20 నిమిషాలకోసారి ఒక బ్రేక్ తీసుకుని ఎక్సర్‌సైజ్ లేదా మెడిటేషన్ చేయాలి. లేదా ప్రతి 20 నిమిషాలకు చక్కటి ప్లేన్ గోడ వైపు 20 సెకండ్ల పాటు చూడాలి. చీకటి గదిలో ఉంటూ ఫోన్ చూడటం మానేయాలి. స్క్రీన్ టైమ్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో మానవుని దైనందిన జీవితంలో స్మార్ట్ ఫోన్ తప్పనిసరి అయిన నేపథ్యంలో స్క్రీన్ టైమ్‌ను ఎంత వీలయితే అంత తగ్గించుకుంటే మంచిది. కంటిపై భారం పడకుండా ఫోన్‌లో బ్లూ లైట్ ఫిల్టర్ లేదా ఐ కంఫర్ట్ ఆప్షన్‌ను ఎప్పుడూ ఆన్ చేసుకుని ఉంచుకోవడం ఉత్తమం. ఇలా చేయడం ద్వారా కంటి సమస్యలు దరిచేరకుండా ఉండే అవకాశాలుంటాయి.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

**– జర్నలిస్టుల భద్రత కోసం – ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి – కలెక్టరేట్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల భద్రత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు సోమవారం నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులు చేసిన వారినీ శిక్షించే హక్కు చట్టానికి ఉందనీ, అనవసరమైన, అసత్య ఆరోపణలపై జర్నలిస్టులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. చట్టానికి ఎవరు అతీతులు కారని నిజంగానే తప్పులు చేసిన వారిని చట్ట పరిధిలో శిక్షించాలని కోరారు. వృత్తిలో భాగంగా జర్నలిస్టులు కవరేజ్ కు వెళ్లిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామికమన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న ఫోర్త్ ఎస్టేట్ గా భావిస్తున్న మీడియా జర్నలిస్టులు ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఆందోళన కు గురవుతున్నారు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని జర్నలిస్టులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సామల గట్టు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, వివిధ ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలి

**వేద న్యూస్, వరంగల్ :**

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న బోధన బకాయిలు ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని కేయూ రీసెర్చ్ స్కాలర్స్, ఐక్య విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కేయూ గెస్ట్ హౌస్ వద్ద పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని, సంక్షేమ పథకాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం విద్యకు మాత్రం ఎందుకు సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తుందని విమర్శించారు. విద్యారంగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విద్యార్థుల సమస్యలను మాత్రం పట్టించుకోవడంలేదని, గత ప్రభుత్వం మీద నింద వేస్తూ తప్పించు కుంటుందని, గతంలో పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేస్తున్న ప్రభుత్వం ఫీజులు విడుదల మాత్రం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. విద్యను, విద్యార్థులను నిర్లక్ష్యం చేయడం కోసమే ప్రభుత్వం కుట్ర పన్ను ఉందని అన్నారు. ఫీజుల విడుదల కోసం అనేకసార్లు ఆందోళనలు చేసి విన్నవించుకున్న ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం పడిన చందంగా వ్యవహరిస్తుందని అన్నారు.




కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుంటే విద్య ఏ రకంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. విద్యారంగం పట్ల కాంగ్రెస్ హామీలు కోటలు దాటిన అమలు మాత్రం గడప దాటడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వీడి పెండింగ్ లో ఉన్న బోధన బకాయిలు ఉపకార వేతనాలను విడుదల చేయాలని బడ్జెట్లో కేటాయించిన 1200 కోట్ల తక్షణమే చెల్లించాలని, ప్రైవేటు కాలేజీల యజమాన్యాలతో చర్చలు జరిపి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక విద్యాసంస్థల బంద్ కు కాకతీయ యూనివర్సిటీ రిసర్చ్ స్కాలర్స్, విద్యార్థి సంఘాల తరపున మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

కేయూ లో వరస గొడవలతో విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని విద్యా వ్యవస్థకు భంగం కలుగుతుందని గతంలో అనేకసార్లు వినతి పత్రాలు అందించిన దానిపై కనీసం స్పందన లేదని, ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు స్పందించి కేయూ లో గొడవలకు కారణమైన వారిని అనుమతించవద్దని బయటి విద్యార్థులను క్యాంపస్, హాస్టల్లోకి రాని వద్దని, యూనివర్సిటీ కి సంబంధం లేని వారు యూని వర్సిటీలో ఉంటూ సంఘాల పేరుతో విద్యాసంస్థల దగ్గర దందాలు చేస్తున్నారని, తెలంగాణ ఉద్యమ సమయంలో, పీహెచ్డీ పోరాటం జరిగేటప్పుడు విద్యార్థి జేఏసీ ఉండేదని, ఆ సమస్య తీరిన తర్వాత ఇప్పుడు కేయూ లో ఎలాంటి విద్యార్థి సంఘాల జేఏసీ లేదని , కేయూ లో ఉండే విద్యార్థి సంఘాలతో చర్చించి సమస్యల మీద పోరాటం చేసేందుకు నూతన జేఏసీ ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. జేఏసీల పేరుతో విద్యాసంస్థల దగ్గర డబ్బులు వసూలు చేసుకునే వారి పట్ల ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు కఠినంగా ఉండాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరేగంటి నాగరాజు, రీసెర్చ్ స్కాలర్స్ డి.తిరుపతి, కేతపాక ప్రసాద్, బి.శ్రీదేవి, ఏఐడీఎస్ఓ రాష్ట్ర కన్వీనర్ ఏ. సత్యనారాయణ, పిడిఎస్ యు, జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎస్ ఎస్ యు జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయి కుమార్, డీ ఎస్ ఏ హనుమకొండ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, నాయకులు ఓ. చిరంజీవి, బొక్క ప్రవర్ధన్, సిహెచ్ రాజ్ కుమార్ అభినయ్, పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణ మత్స్య సహకార సంఘ నిబంధలను పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్న సభ్యులపై చర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేష్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు సభ్యులతో కలిసి సోమవారం పిర్యాదు చేసారు. పత్రిక ప్రకటన కు వివరాలు తెలుపుతూ పట్టణంలోని ప్రధాన చెరువులైన రామ్ చెరువు, కుడి చెరువు, శనగకుంట, బ్రాహ్మణకుంట మొత్తం పట్టణ లోని 361 మత్స్య సహకార సంఘ సభ్యుల అభివృద్ధి పరిధి లో ఉన్నాయని, కానీ కొందరు సంఘ బైలా నిబంధనలను అతిక్రమించి చాపల చెరువులు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసిల్దార్ కు విన్నవించామని పేర్కొన్నారు. వెంట సంఘ ప్రధాన కార్యదర్శి రాజు కుమార్, ఉపాధ్యక్షులు చీకట్ల వీరేశం, సభ్యులు లచ్చయ్య, అంజయ్య, కనకయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు ఆత్మహత్య

**వేద న్యూస్, చొప్పదండి :**



మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని కనకయ్య ఆదివారం రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు కరీంనగర్ కమిషన్ రేట్ లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. ఆర్థిక పరిస్థితుల్లో బాగా లేని కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు వరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గాంధీ లక్ష విగ్రహాల పోస్టర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, హన్మకొండ :**

గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ సభ్యులు రాష్ట్ర మంత్రులైన కొండ సురేఖ ధనసరి సీతక్క హనుమకొండ, వరంగల్ జిల్లాలోని పలు నియోజకవర్గాల శాసనసభ్యులైన నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కె.ఆర్ నాగరాజు లను మర్యాదపూర్వకంగా కలిసి వారిచే బాపు బాట గాంధీజీ లక్ష విగ్రహాల పోస్టర్ ను ఆవిష్కరింపజేశారు. అనంతరం గాంధీ గురించి శాసనసభ్యులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితకాల సేవలు భారతదేశ స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గాలను ఉపయోగపడ్డాయని, ప్రపంచవ్యాప్తంగా పౌర హక్కులు, స్వేచ్ఛా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచాయని అన్నారు. అక్టోబర్ 10 నుండి 14వ తేదీ వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగబోయే మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ గాంధీ, గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, ఏఐసీసీ కోఆర్డినేటర్ పులి అనిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్ రెడ్డి, సాయి చంద్, సంతోష్ రెడ్డి, పలు యువజన కమిటీ నాయకులు పాల్గొన్నారు.


# పూజారి కుటుంబానికి గ్రామ ప్రజల ఆర్థిక సహాయం

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరేం గ్రామానికి చెందిన గుడి పూజారి అప్పవారి దేవమూర్తి, కొద్ది రోజుల క్రితం అనారోగ్యం బారినపడి స్వర్గస్తులయ్యారు. గ్రామ ప్రజలు పూజారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలియజేసి పూజారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా గ్రామ ప్రజలు 50 వేలు రూపాయలు పూజారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

# బతుకమ్మ తెప్పే పనులను నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలు




**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామంలోని బతుకమ్మ తెప్పే నిర్మాణం పై హైకోర్టులో నేడు డబ్ల్యూపిఎన్ 27178/2025 పిటిషన్‌పై విచారణ జరిగింది. విచారణ సందర్భంగా హైకోర్టు. కోదురుపాక గ్రామంలో బతుకమ్మ తేప్పే, కు సంబందించిన పనులను కొనసాగించకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.అదే విధంగా,జిల్లా కలెక్టర్, కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

వేద న్యూస్

మంగళవారం సెప్టెంబర్ 16, 2025

# కేయూలో అడ్మిషన్ కలిగిన విద్యార్థులకు రక్షణ




**వేద న్యూస్ కేయూ క్యాంపస్:**

కేయూ క్యాంపస్ లో నాన్ బోర్డర్స్ పై ఉదాసిన వైఖరి వద్దని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. విశ్వవిద్యాలయ కమిటీ హాల్ లో ప్రిన్సిపాల్ లు, విభాగాధిపతులు, హాస్టల్ డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్ల తో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోని మాట్లాడారు, సెప్టెంబర్ 17వ తేది సాయంత్రంలోగా యూనివర్సిటీలో ఉన్న నాన్ బోర్డర్లు హాస్టల్ రూమ్ లు ఖాళి చేయాలని సర్కులర్ విడుదల చేసారు. గడువు తేదిలోగా ఖాళిచేయని వారిపై నిబంధనల మేరకు చట్టరీత్యా యూనివర్సిటీ, పోలీస్ అధికారులు ఎవరైనా తీసుకొను చర్యలకు బాధ్యత వహించవలసి ఉంటుందని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లు, సీనియర్ ఆచార్యులు, జాయింట్ డైరెక్టర్లతో ఉన్నత స్థాయి కమిటీ వేసి ఎప్పట్టికప్పుడు సమీక్షించాలని నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా సమయానుకూలంగా, నియమిత కాలంలో విభాగాధిపతులు, ప్రిన్సిపాల్ లు, సంబందిత అధికారులు రాత్రి వేళలలో వసతి గృహాలలో బస చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ వెల్లడించారు. ఈకార్యక్రమంలో గత రెండు రోజులగా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు.

# విద్యార్థులకు బుక్స్ అందజేత



**వేద న్యూస్, మరిపెడ:**

స్ఫూర్తి ఎడ్యుకేషనల్, రూరల్ డెవలప్మెంట్ సోసైటీ తెలుగు సేవా సమితి ఆఫ్ నేబ్రాస్క వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో మరిపెడ పాఠశాల యందు ఎన్.ఎం.ఎం.ఎస్ రాయబోయే ఎనిమిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలను అందించడం జరిగింది .ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు ఈ ఆనంతరాములు మాట్లాడుతూ స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ వారు పేద పిల్లలపై చూపించే ఔదార్యానికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. అదేవిధంగా స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య మాట్లాడుతూ పేద పిల్లలకు అన్ని రకాలుగా సహకారం అందించాలని అటువంటి ఉద్దేశంతో ఈ పుస్తకాలు అందివ్వడం జరుగుతుందని ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం 12000 చొప్పున స్కాలర్ షిప్ వస్తుందని ,కావున విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో స్ఫూర్తి ఎడ్యుకేషన్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అన్నారు. ఎస్ఎస్సి విద్యార్థులకు స్నాక్స్ కు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ ఏడెల్లి పరశురాములు, ఉపాధ్యాయులు బి రామ్ మోహన్,బి స్వప్న కె రమేష్ రెడ్డి కె నెహ్రు.ఎం సురేష్.డి ప్రకాష్, శౌరి ఈ. ప్రసాదరావు రావు మరియు విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐమాక్స్ లైట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి 10వార్డ్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంబోజి సునీల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ లోఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదిగా బత్తిని లచ్చయ్య ఇంటిదగ్గర ఐమాక్స్ లేటివ్ ఓపెన్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మకర్ రెడ్డి, ఏఎంసి ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, పెరుమండ్ల గంగయ్య, మునిగల రాజేందర్, మునిగళ్ళసుధాకర్,గుర్రం సత్యనారాయణ రెడ్డి, సంబోజి శ%శీ%బయ్య, కడారి గంగరాజు, సంబోజి నరసయ్య, కడారి శంకర్, సంభోజి ఉదయ, బత్తిని రవి తదితరులు పాల్గొన్నారు.

# బీఎంఎస్ పోరాటం ఫలించింది




**వేద న్యూస్, గంగాధర :**

భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి బీడీ కార్మిక్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి రేణికుంట శంకర్ హాజరై మాట్లాడుతూ తూనిక ఆకుపై జీఎస్టీని 18 శాతం నుండి 5 శాతానికి తగ్గించడం హర్షణీయమని తెలిపారు. దీని వెనుక బీఎంఎస్ చేసిన దీర్ఘకాలిక పోరాటమే ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీడీ పరిశ్రమపై సుమారు 10 లక్షల మంది కార్మికుటీవీలు ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. ఈ పరిశ్రమను చేతివృత్తుల పరిశ్రమగావ గుర్తించాలని ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీఎంఎస్ తరపున పలు దఫాలుగా విజ్ఞప్తి చేసిన విషయాన్ని వివరించారు. రాబోయే రోజుల్లో బీడీ ఉత్పత్తులపై కూడా జీఎస్టీని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, మొగిలిపాలెం తిరుపతి, నక్క అరుణ్, ఆకుల తిరుపతి, దేవరనేని మహేందర్ రావు, నాగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందవద్దు



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక రైతు వేదికను ఆకస్మికంగా తనిఖీ చేసి జిల్లాలో ఆయా పంటల సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వెల్లడించారు. బోయినిపల్లి మండలం కొదురుపాక లోని రైతు వేదికలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తుండగా, కలెక్టర్, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టోకెన్ పద్ధతి, ఎరువుల పంపిణీ పరిశీలించి. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,మాట్లాడారు. జిల్లాలో ఆయా పంటల సాగుకు అణుగుణంగా ఎప్పటికప్పుడు యూరియా స్టాక్ తెప్పిస్తున్నామని స్పష్టం చేశారు. యూరియా విషయమై రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు అప్రమంతంగా ఉండాలని తమ మండలాలకు వచ్చే ఎరువులను రైతుల పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు సరఫరా చేయాలని ఆదేశించారు. రైతులు తమకు అవసరమైన ఎరువులు మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, అప్రమత్తంగా ఉండాలని ఎరువులు పక్కదారి పట్టకుండా.. ఇతర అవసరాలకు వాడకుండా చూడాలని ఆదేశించారు.

**గ్యాస్ స్టవ్ పైనే వంటలు సిద్ధం చేయాలి**

గ్యాస్ స్టవ్ పైనే విద్యార్థులకు ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఆదేశించారు. వేములవాడ మండలం చింతల్ ఠాణా ఆర్%ఉ%ఆర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఆకస్మికంగా తనిఖీ చేశారు. పూర్తి చేసిన కిచెన్ షెడ్, విద్యాలయం ఆవరణను పరిశీలించారు. విద్యాలయం ఆవరణలో నీరు నిలవకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని,ఆదేశించారు. ఈ పర్యటన లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఏడీఏలు, ఏవోలు,ఏఈవోలు, ఉపాధ్యాయులు,పంచాయతీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

# 'వేద' ఆస్పత్రి వైద్యుడికి పట్టా ప్రదానం

- పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అందుకున్న వెంకట్ సాయి నేత్ర
- బెంగళూరు రాజరాజేశ్వరి మెడికల్ కాలేజీ.. ఎంఎస్ ఆప్తమాలజీలో..

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని వీణవంక రోడ్డులో గల 'వేద' ఐ, ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ తిరునహరి వెంకట సాయి నేత్ర ఎంఎస్ ఆప్తమాలజీలో బెంగళూరు రాజరాజేశ్వరి మెడికల్ కాలేజీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. కాలేజీ వారు పట్టాను వెంకటసాయి నేత్రకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు వెంకట సాయి నేత్రకు పట్టణవాసులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. 'వేద' ఆస్పత్రిలోనే వెంకట సాయి నేత్ర భార్య ఎంబీబీఎస్ ఎంఎస్(ఈఎన్‌టీ) వైద్యురాలిగా సేవలందిస్తున్నారు. నాన్న అడుగుజాడలో వెంకటసాయి నేత్ర ముందుకు సాగుతారని పలువురు ఆకాంక్షిస్తున్నారు. జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత గ్రామీణ ప్రజలకు మూడు దశాబ్దాలకుపైగా 1989 నుంచి 'నయన' ఐకేర్ ద్వారా సీనియర్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌గా కంటి వైద్య సేవలందిస్తున్న సురేశ్ బాబు తిరునహరి వారసత్వాన్ని వెంకటసాయినేత్ర ముందుకు తీసుకెళ్తారని పలువురు పేర్కొన్నారు.

# డీట్ యాప్‌పై అవగాహన

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట ప్రభుత్ర డీగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ(తెలంగాణ స్కిల్ అండ్ నాలేడ్జీ సెంటర్ ) విభాగం ఆధ్వర్యంలో డీఈఈటీ (డిజిటల్ ఎంప్లాయ్ మెంట్ ఎక్స్‌చేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌పై ప్రిన్సిపాల్ డా. బీ.రమేష్ అధ్యక్షతన విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉద్యోగాల కోసం డీట్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. యాప్ లో విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవడం వల్ల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, వాటికి కావాల్సిన నైపుణ్యాల గురించి తెలుస్తుందని చెప్పారు. డీట్ లో రిజిస్ట్రేషన్ నమోదు గురించి వివరించారు. డీట్ యాఫ్ లో విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచిం చారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొరారు. కార్యక్రమంలో టిఎస్ కేసీ కో-ఆర్డినేటర్ కె. ఉమాకిరణ్ , వైస్ - ప్రిన్సిపాల్ డా.ఎస్.ఓదెలు కుమార్, డా. కె. రాజేంద్రం, డా. గణేష్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ల అమలులో నిర్లక్ష్యం వద్దు



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, నేత, గీతకార్మికులు తదితర పెన్షనుదారులు తమ హక్కుల కోసం గళం ఎత్తారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం భారీ ఎత్తున ధర్నా చేపట్టి, పెన్షన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ అడ్డూరి అనిల్ మాదిగ, కో-ఇంచార్జ్ బొంకూరి కార్తీక్ మాదిగ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడ్డూరి అనిల్ మాదిగ మాట్లాడుతూ వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ వృద్ధులు వితంతువులు నేత గీతకార్మికులు మరియు ఇతరులకు రూ.4 వేల పెన్షన్, పూర్తిస్థాయి కండరాల క్షీణత గల వారికి రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులను కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం అని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెన్షన్లను అమలు చేయకపోతే నిరసనలు తీవ్ర రూపం దాల్చుతాయి అని హెచ్చరించారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం సమర్పించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు పెన్షన్ల సమస్యపై త్వరలోనే పెద్ద ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు మారుపాక రవీందర్ మాదిగ, మండల ఇన్చార్జ్ నార్లగిరి శ్రీనివాస్, ఎంఎస్పీమండల నాయకులు అంబాల సంపత్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అడ్డూరి నవిన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# సేవాపక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలి



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

బీజేపీ ఖిలా వరంగల్ మండల అధ్యక్షులు తాళ్ల పెల్లి అర్జున్ గౌడ్ వారి ఆధ్వర్యంలో సేవా పక్ష కార్యక్రమం నిర్వహించారు. ఖిలావరంగల్ మండల కన్వీనర్ ఎల్లబోయిన చెంద్రమోహన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. (సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 02 తేదీ) వరకు సేవా పక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 02 తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం లో సేవాపక్ష కార్యక్రమాలు అన్ని విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులను, కార్యకర్తలను, మహిళా కార్యకర్తలను కోరారు.

# సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకం

- బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డే వేడుకలు

**వేద న్యూస్, హుజురాబాద్:**

సమాజ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని బ్రహ్మకుమారీలు కల్పన, శ్రీవాణిలో అన్నారు. హుజరాబాద్ పట్టణంలో సోమవారం ప్రజాపిత బ్రహ్మకుమారీ స్ సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లను పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో సెప్టెంబర్ 15న ఇంజనీర్స్ డే గా జరుపుకుంటారని తెలిపారు. దేశ అభివృద్ధికి ఇంజనీర్లు చేసిన కృషిని, వారు చేసిన సేవలను గుర్తించడమే ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ, సంస్థ సభ్యులు రాజయ్య, ఈశ్వరయ్య, కొమురవెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073